నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 5 | సంచిక: 25 | గురువారం, 25 జూన్ 2026 | పేజీలు - 8 | వెల : 3/-

వాస్తవ తెలంగాణ

విలేఖరులు కావలెను

call:8499902850

రేపు తుంగభద్ర ప్రాజెక్ట్ కొత్త స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవం

హాజరుకానున్న చంద్రబాబు, రేవంత్, డీకే శివకుమార్

₹51 కోట్ల వ్యయంతో ఆరు నెలల్లో గేట్ల నిర్మాణం పూర్తి

2024 వరదల్లో గేటు కొట్టుకుపోవడంతో పటిష్ట చర్యలు

7



# త్రిమూర్తుల.. తుంగభద్రం!

## ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీకి రెడీ

తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకకు అత్యంత కీలకమైన జలవనరుగా ఉన్న తుంగభద్ర డ్యామ్ పునర్నిర్మాణ పనుల్లో ఒక కీలక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. ప్రాజెక్టుకు కొత్తగా అమర్చిన క్రస్ట్ గేట్లను గురువారం అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ముగ్గురు కీలక ముఖ్యమంత్రులు ఏకకాలంలో హాజరుకావడం విశేషం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, అలాగే కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఒకే వేదిక పైకి రానున్నారు.

వాస్తవ తెలంగాణ

# ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా సీరియస్ అంశం: సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ : వాస్తవ తెలంగాణ** ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా సీరియస్ అంశమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్? ఆధ్వర్యంలో నిర్వహించిన జూమ్? సమావేశంలో సీఎం పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌పై అందరూ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐఆర్ అవగాహన సదస్సుల జిల్లా రిపోర్టు తనవద్ద ఉందని, ఈ సమావేశాలు మరిన్ని జరగాలని సూచించారు. SIRపై ఇన్‌ఛార్జి మంత్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. పేదల ఓట్లు పోతే వాళ్ల ఆధార్ కార్డు, రేషన్ కార్డు పోతుందని చెప్పారు.

# ప్రపంచమే .. మహిళలపై వివక్ష

## సంకెళ్లను తెంచుకుని లక్ష్యం దిశగా సాగాలి

## తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

4

ఈ ప్రపంచం మహిళల పట్ల వివక్షతో కూడి ఉందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా మహిళలు తమ లక్ష్యం వైపు దూసుకుపోవాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన 'వెటా ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సాధికారత సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు.



# ఢిల్లీకి మూటలిస్తేనే.. రెన్యువల్ సీఎం!

## రేవంత్ రెడ్డిపై కేటీఆర్ సెటైర్

4

అన్ని వర్గాలకు కాంగ్రెస్ పాలనలో వేధింపులు

72 సార్లు ఢిల్లీ వెళ్లినా రేవంత్ సాధించింది శూన్యం

సత్తుపల్లి పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ విసుర్లు



తెలంగాణకు రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని..రెన్యువల్ సీఎం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు వేశారు. గులాబీ దళపతి కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందన్నారు. సత్తుపల్లిలో పర్యటనలో ఉన్న కేటీఆర్ బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ వర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు.

# కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం



**అశ్వారావుపేట:వాస్తవ తెలంగాణ** కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం అని, మూడు శాఖల సీఎంగా రేవంత్ రెడ్డి, మూడు శాఖల మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల పాలనలో విఫలం అయ్యారని, స్కామ్‌ల ప్రభుత్వాన్ని గద్దె దింపి, స్కీమ్‌ల ప్రభుత్వాన్ని తీసుకురావాలని బీఆర్ఎస్ శాసనసభ పక్ష నేత హరీశ్‌రావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని శ్రీ శ్రీ కళ్యాణ మండపంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటూ ఎదురుచూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల హామీల్లో కళ్యాణ లక్ష్మి పథకం లేకపోయినా దాన్ని తీసుకొచ్చి రూ.13 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి 13 లక్షల మందికి పైగా లబ్ది చేకూర్చామని తెలిపారు. కరోనా సమయంలో కూడా ఏ సంక్షేమ పథకాన్ని నిలిపివేయలేదని, రైతుబంధు ద్వారా రైతులకు రూ.73 వేల కోట్ల సహాయం అందించినట్టు చెప్పారు. 2024 ఎన్నికల్లో కృతజ్ఞత కంటే ఆశ గెలిచిందని, అందువల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందని అన్నారు.

# ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరందించాలి

## స్వయంసమృద్ధి గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు : పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క



**హైదరాబాద్:వాస్తవ తెలంగాణ** రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగు నీరందించాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని ప్రజాభవన్‌లో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖపై సమీక్ష? నిర్వహించారు. శాఖల వారీగా పనుల పురోగతి, భవిష్యత్ లక్ష్యాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు సహా ప్రతి ఇంటికి నిరంతరాయంగా రక్షిత మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటి నాణ్యతపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 'పాత బావులను గుర్తించి పునరుద్ధరించాలి. బావుల చుట్టూ రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలను నివారించాలి. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంటకుంట, ప్రతి ఊరిలో ఊటకుంట ఉండేలా చర్యలు చేపట్టాలి' అని అధికారులను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రోడ్లు నిర్మించడం మాత్రమే కాదనీ, గ్రామాల్లో నివసించే ప్రతి వ్యక్తి జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమేనని గుర్తు చేశారు. పంచాయతీరాజ్ శాఖల పరిధిలో 1.35 లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారనీ, ఏటా రూ.34 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చవుతున్నాయని గుర్తుచేశారు. ఇంత భారీ యంత్రాంగం, నిధులు ఉన్నప్పటికీ గ్రామాల రూపురేఖలు ఆశించిన స్థాయిలో మారకపోవడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. 'జిల్లా స్థాయిలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు ఒకే టీమ్‌గా పనిచేయాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి. ప్రతి గ్రామానికి అవసరాలు, వనరులు, సమస్యలను గుర్తించి వాటి ఆధారంగా కార్యాచరణ అమలు చేయాలి..' అని ఆదేశించారు. కొన్నిచోట్ల గ్రామసభలు నిర్వహించకుండా నిధులు ఖర్చు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయనీ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ల నిధుల వినియోగంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు.

# ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి అర్హుడు భాగస్వామి కావాలి

## ఎన్ఐఆర్-2026పై ప్రజల్లో పూర్తి అవగాహన అవసరం. డ్రగ్స్ రహిత సమాజానికి అందరూ కృషి చేయాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్








**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026)లో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఎన్ఐఆర్-2026పై అవగాహన కల్పించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 2కే రన్‌ను మెదక్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానం వద్ద కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా ఖచ్చితత్వంపై ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడుతుందని చెప్పారు. ఇప్పటికే ఓటరుగా నమోదైన వారు తమ వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పరిశీలించుకుని అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేసుకోవచ్చున్నారు. ఇందుకు బూత్ లెవల్ అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు. మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రజలు ఈ ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని కోరారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోందని, అర్హులకు ఓటు హక్కు కల్పించడం ఎంత ముఖ్యమో, అనర్హులను జాబితా నుంచి తొలగించడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ..సర్ కార్యక్రమంలో ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని, దీనివల్ల నకిలీ ఓట్లు తొలగించే అవకాశం ఉంటుందని అన్నారు. యువత మత్తు పదార్థాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజ్ మాట్లాడుతూ.. బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు సర్ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. 18 ఏళ్లు పూర్తిచేసుకున్న యువతీ యువకులు ఓటరుగా నమోదు కావాలని, మరణించిన వారు, డూప్లికేట్‌గా నమోదైన ఓటర్ల వివరాలను తొలగించే ప్రక్రియలో సహకరించాలని కోరారు. అనంతరం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ రహిత సమాజం సెల్ఫీ పాయింట్‌ను కలెక్టర్, అదనపు ఎస్పీ సందర్శించారు. ఈకార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, ఎన్నికల సూపరింటెండెంట్ గఫార్, ఆర్అండ్‌బీ ఈఈ వేణు, జిల్లా పౌరసంబంధాల అధికారి రామచంద్రరాజు, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడలతో శారీరక, మానసిక వికాసం

## ఆరోగ్యవంతమైన యువతతోనే దేశాభివృద్ధి జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్:-** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రీడలు, విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతలో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన వన్‌డే క్రికెట్ టోర్నమెంట్ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించారు. టోర్నమెంట్‌లో రాయల్ వారియర్స్ జట్టు ప్రథమ విజేతగా నిలిచి రూ.5 వేల నగదు బహుమతి, ట్రోఫీని అందుకోగా, రాయల్ ఆవుసులపల్లి జట్టు ద్వితీయ విజేతగా నిలిచి రూ.2,500 నగదు బహుమతి, ట్రోఫీని అందుకుంది. విజేతలు, రన్నరప్ జట్లకు అదనపు ఎస్పీ ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి దోహదపడతాయని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. ఆరోగ్యవంతమైన యువతతోనే బలమైన సమాజం, అభివృద్ధి చెందిన దేశం నిర్మితమవుతుందని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారిని నేరస్థులుగా కాకుండా బాధితులుగా పరిగణిస్తూ, వారికి కౌన్సెలింగ్ అందించి డీ-అడిక్షన్, పునరావాస కేంద్రాల ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకొస్తున్నామని తెలిపారు. వ్యసనాల నుంచి బయటపడాలనుకునే వారికి పోలీస్ శాఖ అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, డ్రగ్స్ విక్రయం, వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అనంతరం యువతతో కలిసి డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్, పోలీసు అధికారులు, టోర్నమెంట్ నిర్వాహకులు, యువత, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



# 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలి:

2003 డీఎస్సీ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సంతోష్ కుమార్



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరహాలో తెలంగాణలోనూ 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని 2003 డీఎస్సీ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇమ్మడి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మెదక్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 57/4, 57/5 మెమోల మేరకు 2004 సెప్టెంబర్ 1కు ముందు విడుదలైన నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపజేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. డీఎస్సీ-2003 నోటిఫికేషన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విడుదలైందని, అదే నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు ఒక రాష్ట్రంలో పాత పెన్షన్, మరో రాష్ట్రంలో కొత్త పెన్షన్ విధానం అమలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్ మాదిరిగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేసి న్యాయం చేయాలని కోరారు.

# బీఆర్ఎస్ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి: బిఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి..



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మెదక్ జిల్లా బీఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి సూచించారు. బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి ఉదయ్,దీపక్ కుమార్,జుబేర్ మహమ్మద్,సోహెల్ ఖాజా మోహినొద్దీన్,మాజీ కౌన్సిలర్ మాయ మల్లేశం,నాయకులు ఇందాద్,సాయి తదితరులు ఆయన నివాసం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కంఠరెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచనలు, సలహాల మేరకు మెదక్‌లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ శ్రేణులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాలని కౌన్సిలర్లకు సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్న ఆయన, కార్యకర్తల సంక్షేమం,సంస్థాగత బలోపేతం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని తెలిపారు. నాయకులు, కౌన్సిలర్లకు ఎలాంటి అవసరం వచ్చినా తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. అనంతరం కౌన్సిలర్లు, నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

# పల్స్ పోలియోను విజయవంతం చేయండి జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్





**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :** ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్ సూచించారు. బుధవారం మాతా శిశు సంరక్షణ దవాఖానలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు 75,496 మంది చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. వీరందరికీ పోలియో చుక్కలు అందించేందుకు 457 బూత్‌లు, మొబైల్ మరియు ట్రాన్సిట్ బృందాలతో కలిపి 872 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమం నిర్వహణకు 1,828 మంది ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యులు, ఇతర సిబ్బందిని నియమించినట్లు వివరించారు. జిల్లాలో 125 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి, అక్కడ 657 మంది చిన్నారులను నమోదు చేసినట్లు తెలిపారు. ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు తీసుకోకుండా మిగిలిపోకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని 100 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి...


### శంకర్ పల్లి మున్సిపల్ చైర్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్...



**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శంకర్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సాత ప్రవీణ్ కుమార్ సూచించారు. బుధవారం సిటిజన్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని చైర్ పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంస్థలు జరిపే ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కాగా ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్ పరీక్ష, ఈసీజీ, రొమ్ము ఆరోగ్య పరీక్ష, జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 250 మంది పట్టణ ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగారెడ్డి, కమిషన ర్ యోగేష్, మేనేజర్ వి. అంజన్ కుమార్, కౌన్సిలర్లు, కో– ఆప్షన్ సభ్యులు, డాక్టర్లు పాల్గొన్నారు.



# ఖేడ్ జడ్పీహెచ్ఎస్ కు ల్యాప్ టాపులు అందజేత




**నారాయణ ఖేడ్,వాస్తవ తెలంగాణ న్యూస్:** ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించడం కోసం హైదరాబాదులోని అంనెట్ డిజిటల్ సాఫ్ట్వేర్ సంస్థ 10 ల్యాప్ టాప్ లను నారాయణఖేడ్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మన్మధ కిషోర్ కు అందజేశారు..ఈ సందర్భంగా అంనెంట్ డిజిటల్ సాఫ్ట్వేర్అ సంస్థ ప్రతినిధులు సీఈవో కృష్ణ రెడ్డి, సీనియర్ డైరెక్టర్ వల్లి సూర్యదేవర, హర్షిత్ సక్సేన, అభిలాష్, మల్లేశ్వరి, లయన్స్ క్లబ్ సభ్యులు నాగరాజు, అరుణ, మాధవి సూర్య మాట్లాడుతూ ఖేడ్ ప్రభుత్వ పాఠశాలలో 870 మంది విద్యార్థులు చదవడం అభినందనీయమన్నారు. అలాంటి పాఠశాలకు తమ సేవలు అవసరమని గుర్తించి లయన్స్ సభ్యులు చంద్ర శేఖర్ ఆచార్య చెప్పడంతో 5 లక్షల విలువగల 10 ల్యాప్ ట్యాప్ లను అంనెంట్ డిజిటల్ సాఫ్ట్వేర్ సంస్థ సహకారంతో అందజేశామని, దీనిని పాఠశాల విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోవు రోజులలో పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో అంనెంట్ డిజిటల్ సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధులు సీఈవో కృష్ణ రెడ్డి, సీనియర్ డైరెక్టర్ వల్లి సూర్యదేవర, హర్షిత్ సక్సేన, అభిలాష్, మల్లేశ్వరి,లయన్స్ క్లబ్ సభ్యులు నాగరాజు, అరుణ, మాధవి సూర్య,ఉపాధ్యాయులు రాజశేఖర్,చంద్ర శేఖర్ ఆచార్య తదితరులు పాలుగోన్నారు.

# బీరప్ప మల్టీ పర్పస్ హాల్‌కు రూ. కోటి నిధులు

**కుర్మ సంఘం డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూల స్పందన**
**మంత్రి శ్రీధర్ బాబు చొరవతో నిధుల మంజూరు**
**కొలన్ హన్మంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన సంఘ ప్రతినిధులు**
**బాచుపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో సత్కార కార్యక్రమం**



**బాచుపల్లి, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** బీరప్ప మల్టీ పర్పస్ హాల్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ.1 కోటి నిధులు మంజూరు చేయడం పట్ల కుర్మ సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధుల మంజూరులో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కృషి కీలక పాత్ర పోషించిందని సంఘ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కుర్మ సంఘ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. బీరప్ప మల్టీ పర్పస్ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.1 కోటి నిధులు మంజూరు చేయించడంలో ఆయన చేసిన కృషికి కృతజ్ఞతలు తెలియజేశారు. కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కుర్మ సంఘం అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, సంఘ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. మల్టీ పర్పస్ హాల్ నిర్మాణం పూర్తయిన తర్వాత సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఇది కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కుర్మ సంఘ అధ్యక్షుడు బట్ట బాలకృష్ణ, సూరారం విలేజ్ చైర్మన్ బట్ట నర్సింహా, ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలయ్య, పెంటయ్య, సెల్వియోజి సత్తయ్య, చిన్న సత్తయ్య, బాలరాజ్, కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలనలో ప్రజల అభ్యున్నతి కై సంక్షేమ ఫలితాలపై శివసేన నాయకులు అక్కల సురేష్ సమీక్షా...







**ఘాట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఘాట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ లో నీ శివసేన తెలంగాణ రాష్ట్ర మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ అక్కల సురేష్ నేడు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయాన్ని సందర్శించి, అమలులో ఉన్న సంక్షేమ పథకాల వివరాలు, వాటి ప్రస్తుత స్థితిగతులు మరియు ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై అధికారులతో చర్చించి సమాచారం తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం, భూ హక్కులు, సామాజిక భద్రత మరియు సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. పథకాల అమలులో ఎదురవుతున్న సవాళ్లు, ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి కమిషన్ చేపడుతున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కల సురేష్ మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతి కోసం రూపొందించిన సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి పారదర్శకంగా మరియు సమర్థవంతంగా చేరాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడం, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో అర్హులైన లబ్ధిదారులు పూర్తి స్థాయిలో ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ మరియు వెనుకబడిన వర్గాల సంక్షేమం విషయంలో శివసేన ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వ శాఖలు, కమిషన్‌లు మరియు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భన సందర్భంగా కమిషన్ అధికారులు పలు సంక్షేమ కార్యక్రమాల అమలు, వాటి ప్రభావం మరియు భవిష్యత్ కార్యాచరణపై వివరాలు అందించారు. ప్రజా సంక్షేమం మరియు సామాజిక న్యాయం కోసం ఇలాంటి నిర్మాణాత్మక చర్చలు కొనసాగుతాయని తెలిపారు.

# ప్రభుత్వ భూమిలో అక్రమ రహదారి నిర్మాణమా?

**మైసా కన్స్ట్రక్షన్ ప్రాజెక్టుపై విచారణకు ఆకుల సతీష్ డిమాండ్**
**పేట్ బషీరాబాద్ సర్వే నంబర్ 23 భూమి వినియోగంపై ఆరోపణలు**
**ట్రాఫిక్ డీసీపీ కార్యాలయం కూల్చివేత వెనుక కారణాలపై సందేహాలు**
**అప్రోచ్ రోడ్ లేకున్నా అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్న**
**ప్రభుత్వ భూమి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**
**గత పరిపాలనా నిర్ణయాలపై సమగ్ర విచారణ కోరిన సామాజిక కార్యకర్త**



**పేట్ బషీరాబాద్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** పేట్ బషీరాబాద్ పరిధిలోని సర్వే నంబర్ 23లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేట్ నిర్మాణ సంస్థ మైసా కన్స్ట్రక్షన్ ప్రాజెక్టుకు అప్రోచ్ రోడ్డుగా వినియోగిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పేట్ బషీరాబాద్ సర్వే నంబర్ 23లో సుమారు 5.25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. ఇందులో కొంత భూమిని ప్రభుత్వ పాఠశాల, పేదల అవసరాలు, అలాగే ట్రాఫిక్ డీసీపీ జోనల్ కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్మాణం కోసం కేటాయించినట్లు వివరించారు. ఈ ప్రభుత్వ భూమికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్లు 12, 24లో మైసా కన్స్ట్రక్షన్ భారీ నిర్మాణ ప్రాజెక్టును చేపట్టిందని, ప్రాజెక్టుకు అవసరమైన 60 అడుగుల అప్రోచ్ రోడ్ లేకపోయినా సంబంధిత అనుమతులు మంజూరయ్యాయని ఆరోపించారు. ఈ అంశంపై సంబంధిత శాఖలు పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. 2021లో హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడిన అనంతరం ప్రభుత్వ భూమిలో నిర్మించిన ట్రాఫిక్ డీసీపీ కార్యాలయం 2023 జూన్ 25న కూల్చివేయబడిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అప్పటి పాలకుల పాత్రపై కూడా విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సంబంధిత నిర్మాణానికి సరైన అప్రోచ్ రోడ్ అంశం వివాదాస్పదంగానే కొనసాగుతోందని, దీనికి సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న సమయంలో ప్రభుత్వ భూమిలో తారు రహదారి నిర్మించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. దీనిపై రెవెన్యూ, మున్సిపల్, జిల్లా యంత్రాంగం స్పష్టత ఇవ్వాలని కోరారు. మైసా కన్స్ట్రక్షన్ ప్రాజెక్టు సమీపంలో సుమారు 1,200 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని ఆకుల సతీష్ ఆరోపించారు. ఇటీవల ప్రజావాణిలో చేసిన ఫిర్యాదు మేరకు సంబంధిత భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్ కార్యాలయం నుంచి లేఖ జారీ అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూమిలో నిర్మించిన రహదారిపై సమగ్ర విచారణ జరపాలని, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని, అవసరమైతే ఆ స్థలాన్ని పార్కు లేదా ట్రాఫిక్ డీసీపీ కార్యాలయానికి కేటాయించాలని, మైసా కన్స్ట్రక్షన్‌కు మంజూరైన అనుమతులపై సమీక్ష నిర్వహించాలని, గతంలో తీసుకున్న పరిపాలనా నిర్ణయాలపై విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్ల జైశంకర్ గౌడ్, పులి బలరాం, ఎల్ల స్వామి, అంకం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్‌లో ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ ప్రారంభం

**జీడిమెట్లలో 22,745 మంది మహిళలకు ప్రభుత్వ కానుక**
**పొదుపు సంఘాల సభ్యులకు ఉచితంగా చీరల అందజేత**
**మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న అధికారులు**
**జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ**
**మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట**
**ఉత్సాహంగా హాజరైన మహిళా సంఘాల సభ్యులు**



**జీడిమెట్ల, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం పరిధిలోని జీడిమెట్ల సర్కిల్‌లో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద చీరల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ శ్రీ పింకేష్ కుమార్, ఐఏఎస్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మహిళల సంక్షేమం, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహదపడు తున్నాయని తెలిపారు. జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని పొదుపు సంఘాల సభ్యులైన మొత్తం 22,745 మంది మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళల స్వావలంబన, సామాజిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్, ప్రాజెక్టు అధికారి ఎల్. ఇంద్రసేన, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పి. సునీత, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, పొదుపు సంఘాల నాయకులు, మహిళా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేవంత్ రెన్యువల్ సీఎం

ముఖ్యమంత్రిపై కేటీఆర్ సెటైర్



- అన్ని వర్గాలకు కాంగ్రెస్ పాలనలో వేధింపులు
- 72 సార్లు ఢిల్లీ వెళ్లినా రేవంత్ సాధించింది శూన్యం
- సత్తుపల్లి పర్యటనలో కేటీఆర్ విసుర్లు

తెలంగాణకు రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. ఆయన రెన్యువల్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని అన్నారు. సత్తుపల్లిలో పర్యటనలో ఉన్న కేటీఆర్ బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, . రాష్ట్రంలో ఏ వర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. వాస్తవ తెలంగాణ

### విలేకర్లకు అన్యాయం చేశారు..

సత్తుపల్లి విలేకర్లకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్ జారీ చేసి రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాల్టీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు.

### మళ్లీ కేసీఆర్ రావాలని..

తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలస పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఓటములు, గెలుపులు చూశారని.. అనాడు తెలుగుదేశం పార్టీలో అన్నగారితో కలిసి నడిచారని ప్రస్తావించారు. అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పూజలలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందిన బండి రమేష్



**కూకట్‌పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్** బోరబండ గాయత్రీ నగర్ పరిధిలోని జనప్రియ నగర్ లో నూతనంగా నిర్మాణం జరుపుకున్న శ్రీ విజయగణపతి, శ్రీ సీతారామాంజనేయ స్వామి, శ్రీ త్రికూటాలయశీ ప్రారంభోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామి వార్ల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులను రమేష్ అభినందించారు. దైవానుగ్రహం సంపూర్ణంగా లభించాలని ఆశీర్వదించారు. మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, వేముల సత్యం, గాలి బాలాజీ, దినేష్ కుమార్, సుంకన్న, అది రెడ్డి, మస్తాన్ రెడ్డి, రవి ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఒలింపిక్ డే రన్ దోహదం చేస్తుంది: ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి వాస్తవ తెలంగాణ** ఒలింపిక్ డే రన్ అనేది కేవలం క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ మైదానంలో నిర్వహించిన 40వ అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఒలింపిక్ టార్చ్ వెలిగించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడలను జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఒలింపిక్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని, క్రీడా రంగంలో మరింత మంది యువత రాణించాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ మైదానం నుంచి ఐబీ వరకు నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు హరికిషన్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ జగన్, సంయుక్త కార్యదర్శులు వెంకటేశం, జేశ్వంత్ గౌడ్, పీఈటీ సంఘం బాధ్యులు షర్ఫుద్దీన్, సుభాష్ గౌడ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచమే .. మహిళలపై వివక్ష

- సంకెళ్లను తెంచుకుని లక్ష్యం దిశగా సాగాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**వాస్తవ తెలంగాణ** ఈ ప్రపంచం మహిళల పట్ల వివక్షతో కూడి ఉందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా మహిళలు తమ లక్ష్యం వైపు దూసుకుపోవాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు .హైదరాబాద్ జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన 'వెటా ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సాధికారత సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. "మహిళలు ఎంత కష్టపడి ప్రతిభ చూపినా, ఏదో ఒక దశలో వారికి అడ్డుకట్ట పడుతోంది. ఉన్నత స్థాయికి వెళ్లే కొద్దీ మహిళలకు అవకాశాలు తగ్గిపోతున్నాయి. న్యాయవ్యవస్థలో ప్రవేశ పరీక్షలు రాసే మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నా, పైస్థాయికి వెళ్లేసరికి వారి సంఖ్య తగ్గిపోవడమే దీనికి నిదర్శనమని అన్నారు.

### ఆలోచన విధానంలో మార్పు రావాలి

వివాహం, పిల్లల బాధ్యతల వల్ల కెరీర్‌లో వచ్చే గ్యాప్ మహిళలను వెనక్కి నెడుతోందని పేర్కొన్నారు. "సమాజంలో మహిళలంతా ఒక్కటే.. మనమంతా ఒకటే కులం. ఇక్కడ ఉండేవి రెండే కులాలు.. ఒకటి మహిళల కులం, రెండోది మగవారి కులం. సమాజం ఆలోచన విధానంలో మార్పు రావాలి. తెలంగాణ ప్రభుత్వ హయాంలో పోలీసు ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించినా, కుటుంబం, సమాజం నుంచి ఆశించిన మద్దతు లభించకపోవడంతో ఆ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ కావడం లేదన్నారు. 'నేటి యువత సోషల్ మీడియా లైక్స్, ఫాలోవర్స్ కోసం ఆరాటపడుతోంది. కానీ ఇంటర్నెట్, ఏఐ కూడా మహిళల పట్ల వివక్షను చూపిస్తున్నాయి. గతంలోని అభిప్రాయాల ఆధారంగానే అవి సమాచారాన్ని ఇస్తున్నాయి. ఇక రాజకీయాల్లో మహిళలు ఏదైనా మాట్లాడితే వారి వ్యక్తిత్వాన్ని, జెండర్‌ను ఉద్దేశించి ట్రోలింగ్ చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేసారు.

### బాల్య వివాహాలు తగ్గకపోవడం విచారకరం

"ప్రభుత్వాలు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా టీనేజ్ వివాహాలు తగ్గకపోవడం విచారకరం. 1519 ఏళ్ల లోపు పెళ్లిళ్లు చేసుకుని తల్లులవుతున్న వారు మన రాష్ట్రంలో 7.2 శాతంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఆడపిల్లకు పెళ్లి చేస్తే బాధ్యత తీరిపోతుందని తల్లిదండ్రులు భావించకూడదని కవిత అన్నారు. "మహిళలు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే, దాని కోసం మొండిగా కష్టపడాలి. ఒకసారి నిర్ణయం తీసుకున్నాకమీమాటమీరేవినవద్దు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో ముందుకు సాగాలి" అని కవిత హితవు పలికారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్న వెటా ఇండియా సంస్థ అధినేత ఝాన్సీ కృషిని ఆమె అభినందించారు.

# నర్సాపూర్ మున్సిపల్ ఒకటవ మరియు రెండవ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ రాజు లక్ష్మీ యాదవ్





**నర్సాపూర్ వాస్తవ తెలంగాణ** మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ 1వ వార్డు మరియు 2వ వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్ , 1వ వార్డు కౌన్సిలర్ నర్సమ్మ , 2వ వార్డు కౌన్సిలర్ సుధీర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ మరియు మున్సిపల్ సిబ్బంది కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వివరాలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించి ప్రజలకు వివరించి, అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, వార్డుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిత్తారమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన లో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు వాస్తవ తెలంగాణ** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం బొల్లారం డివిజన్ పరిధిలోని వైయస్సార్ కాలనీలో నూతనంగా నిర్మించిన చిత్తారమ్మ దేవాలయంలో బుధవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై.. ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, మాజీ జడ్పిటిసి బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, చంద్రారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

# నాగారం డివిజన్ లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం లో నాయకులచే చీరల పంపిణీ..

**కాంగ్రెస్ పార్టీ లో మహిళలు సముచిత స్థానం..మహిళలు.**






**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ వెంకటేశ్వర కాలనీ, మామిండ్ల నారాయణ కాలనీ లలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మరియు మాజీ కార్పొరేటర్ల మరియు సీనియర్ నాయకుల చేత మహిళలకు చీరలను పంపిణీ చేశారు. బోగారం లో కౌకుట్ల జీవన్ రెడ్డి మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొని ఇందిరా మహిళ శక్తి పథకం లో భాగంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అలాగే గోధుమకుంట లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటిసి కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్ మరియు కాంగ్రెస్ నాయకులు ఇందిరా మహిళ శక్తి కార్యక్రమం లో పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్నా మహిళలు సంతోషం తో ఇందిరా మహిళ శక్తి కార్యక్రమన్నీ, నాయకులను కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు సముచిత స్థానాన్ని కల్పించినందుకు మహిళలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో నాగారం డివిజన్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు,సర్పంచ్లు, ఎంపిటిసి లు, సీనియర్ నాయకులు, యువ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, మహిళలు బారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కత్తిరించినా చెట్ల కొమ్మలను మరిచినా విద్యుత్, మున్సిపల్ అధికారులు..

**ఎండినా ఆకు,కొమ్మలతో రహదారుల్లో ఇబ్బందులు పడుతున్నా ప్రజలు.**

**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ ఎస్వి నగర్ కాలనీ రోడ్ నెంబర్ – 1 మరియు పరిసర కాలనీలలో 10 రోజుల క్రితం విద్యుత్ శాఖ కొట్టిన చెట్ల కొమ్మలను తీసే నాథుడేలేడు అని, ఎండిన కొమ్మాల నుండి రాలిన ఆకులు వడ గాలులకు ఇళ్లలోకి వచ్చి ఇబ్బంది గా మారింది అని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలూ, వృద్దులు అనారోగ్యం పాలు అవుతున్నారు అని మున్సిపల్ అధికారులు తొందరగా ఈ విషయం స్పందించి కాలనీ లలో కరెంట్ విభాగం వారు కత్తిరించినా చెట్ల కొమ్మలను తొందరగా తీసివేయాలని కోరారు. కాలనీ వాసులు ఇబ్బందులను సంభంధిత అధికారులుగమనించి తక్షణమే చర్యలు తీసుకొని ఈ సమస్యను పరిష్కరించవలసింది గా కాలనీ వాసులు కోరారు.

# బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన


**గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు....**




**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి** .గురువారం రాజీవ్ గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు జిహెచ్ఎంసి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ని వారి నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను పుప్పాల భాస్కర్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ కాలనీ సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రజల సహకారంతో రాజీవ్ గాంధీ నగర్‌ను ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంచల అజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు టి. విక్రమ్, కోశాధికారి పి. సంపత్ రెడ్డి, కాలనీ ప్రముఖులు చింతకింది వెంకటేష్, మహిపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు వెంకటేష్ గౌడ్,రమేష్, సర్వన్,బ్రహ్మ,సుబ్బారావు,రాజేష్ కుమార్,సతీష్,టి. శ్రీనివాస్, అవినాష్, జి. రాజేందర్ రెడ్డి ,సిహెచ్. అశోక్, ఎమ్. వేణుగోపాల్,షేక్ ముబిన్, టి. రవి కుమార్,ఫణీంద్ర, నవీన్,ఎన్. అవినాష్ తదితరులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మల్లంపేట్, గాగిల్లాపూర్‌లో డీసీ విస్తృత పర్యటన

ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో తనిఖీలు
డ్రీమ్ వ్యాలీలో వాటర్ లాగింగ్ సమస్యపై ప్రత్యేక దృష్టి
వర్షాకాలానికి ముందే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం
ప్రభుత్వ పాఠశాలలో నిర్మిస్తున్న వాష్‌రూమ్‌ల పనుల పరిశీలన
నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచనలు
గాగిల్లాపూర్ వెంచర్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం
చేయాలని ఆదేశం ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యమన్న డీసీ వెంకట మణికరణ్





**దుండిగల్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు.....** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ బుధవారం మల్లంపేట్, గాగిల్లాపూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మల్లంపేట్ డ్రీమ్ వ్యాలీ కాలనీ రోడ్ నెంబర్–1లో వర్షపు నీరు నిలిచిపోయే లోతట్టు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. స్థానికులు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించిన డీసీ, రానున్న వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. వాటర్ లాగింగ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అసిస్టెంట్ ఇంజనీర్ (మెయింటినెన్స్) బి. సురేందర్ నాయక్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డిలను ఆదేశించారు. అనంతరం మల్లంపేట్ ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్మాణంలో ఉన్న నూతన వాష్ రూమ్‌ల పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన పారిశుధ్య సదుపాయాలు అందేలా నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గాగిల్లాపూర్‌లోని దీప్తి సువర్ణ సంపద వెంచర్‌ను కూడా డీసీ సందర్శించారు. వెంచర్ నిర్వాహకులు రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పరిశుభ్రత తదితర మౌలిక వసతుల కల్పనపై సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలించిన ఆయన, అవసరమైన సదుపాయాల కల్పనకు సంబంధించి సమగ్ర నివేదికతో పాటు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనల్లో అసిస్టెంట్ ఇంజనీర్ సురేందర్ నాయక్, డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, కాలనీప్రతినిధులు,స్థానిక పాల్గొన్నారు.

# ప్రజాభవన్‌లో డిప్యూటీ కమిషనర్‌పై ఎస్ఎఫ్ఏ జానకి ఫిర్యాదు

-జీడిమెట్ల సర్కిల్ పరిధిలో వేధింపుల ఆరోపణలు
-అవమానకర వ్యాఖ్యలు, మానసిక వేధింపులు ఎదుర్కొన్నానని వెల్లడి
-ఉన్నతాధికారుల జోక్యం కోరిన మహిళా ఉద్యోగి
-ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరపాలని విజ్ఞప్తి
-బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
-న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరిన జానకి
-ఆరోపణలను ఖండించిన డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్

**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి** దుర్గారావు...జీడిమెట్ల సర్కిల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఏ జానకి తనకు విధి నిర్వహణలో వేధింపులు, అవమానకర వ్యాఖ్యలు ఎదురవుతున్నాయని ఆరోపిస్తూ ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశారు. డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్ వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఆమె, తనకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. జానకి తెలిపిన వివరాల ప్రకారం, విధి నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు చేయకపోయినా తనను లక్ష్యంగా చేసుకుని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యాలయ వ్యవహారాల్లో తన పట్ల అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, అవమానకర వ్యాఖ్యలు చేస్తూ మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌కు, సంబంధిత ఉన్నతాధికారులకు, రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు జానకి తెలిపారు. అయితే తన ఫిర్యాదులపై ఇప్పటివరకు ఎటువంటి న్యాయం జరగలేదని, స్పష్టమైన చర్యలు కూడా కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తనకు న్యాయం చేయాలంటూ ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. తన సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సరైన స్పందన లభించలేదని పేర్కొన్నారు. తన ఫిర్యాదును పరిశీలించి వాస్తవాలను వెలికితీయడంతో పాటు నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. మహిళా ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న తనకు భద్రమైన, గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.





ప్రశ్నిస్తే ఆరోపణల ..!

ఆరోపణలను ఖండించిన డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్జానకి చేసిన ఆరోపణలపై స్పందించిన జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్, తాను ఎప్పుడూ ఆమెను వేధించలేదని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం కనిపించడంతో అధికారిగా ప్రశ్నించానని, దానిని వేధింపులుగా అభివర్ణించడం సరికాదన్నారు. జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని పలు కాలనీల నుంచి ఆమె పనితీరుపై ఫిర్యాదులు అందాయని, వాటి ఆధారంగానే వివరణ కోరినట్లు తెలిపారు. "ఆమెపై నాకు ఎటువంటి వ్యక్తిగత ద్వేషం లేదా కోపం లేదు. అధికారిక బాధ్యతల్లో భాగంగానే ప్రశ్నించాను" అని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు నమోదులో నిర్లక్ష్యం ఉందని, కార్మికుల అటెండెన్స్ సక్రమంగా నమోదు చేయకపోతే వారికి వేతనాలు ఎలా అందుతాయని ప్రశ్నించినట్లు తెలిపారు. "ఉద్యోగ బాధ్యతల గురించి అడిగినంత మాత్రాన వేధింపులుగా పరిగణించడం సరికాదు" అని వ్యాఖ్యానించారు. అదేవిధంగా గత మూడు నెలలుగా విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, కొన్నిసార్లు పై అధికారులకు సమాచారం ఇవ్వకుండానే గైర్హాజరవుతున్నట్లు గుర్తించామని చెప్పారు. ఇటీవల ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తిరుపతిలో సేవా కార్యక్రమాలకు వెళ్లిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ వ్యవహారంలో ఇరువర్గాలు భిన్న వాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో, ఫిర్యాదుపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని ఉద్యోగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఫిర్యాదులోని అంశాలపై విచారణ అనంతరం నిజానిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

# ఈ రోజు ఈ క్రింది ప్రాంతాల్లో కరెంట్ కు సరఫరా కు అంతరాయం..



**కీసర మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర మండలం లో25.06.2026 గురువారం. ఫీడర్ మెయింటెనెన్స్ ఒ ట్రీ బ్రాంచ్‌లు కింది ఫీడర్‌ల పరిధిలో కత్తిరించడం వల్ల ఈ కింది ప్రాంతాలు1) రాంపల్లి దయారా సబ్‌స్టేషన్ నుండి 11కె వి కరీంగూడ ఏ జి ఎల్ ఫీడర్ 09:30 ఉదయం నుండి 12:30 మధ్యాహ్నం వరకు, మరియు : జాఫర్‌గూడ, తుర్కా దయార, బాల వికాస్, దయారా గ్రామం ఏ జి ఎల్, వేల్పుల వనం, రాంపల్లి దయార ప్రధాన రహదారి, కరీంగూడ అగ్ల్. 2) రాంపల్లి దయార ఎస్ ఎస్ నుండి 11 కె వి వన్నిగూడ ఏ జి ఎల్ ఫీడర్ 2:30 మధ్యాహ్నం నుండి 05:00 సాయంత్రం వరకు, కవర్ చేయబడిన ప్రాంతాలు : బోగారం గ్రామం బోగారం అగల్, బర్షిగూడ గ్రామం ఒ బర్షిగూడ అగల్, లలో విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుంది అని సంబంధిత కీసర ఫణీంద్ర,అధికారులు తెలిపారు.

# గీతంలో సీనియర్ రీసెర్చ్ ఫెలో అవకాశం

## జూలై 10లోగా దరఖాస్తు చేసుకోవాలి

**పటాన్ చెరు వాస్తవ తెలంగాణ** గీతంలో సీనియర్ రీసెర్చ్ ఫెలో అవకాశం జూలై 10లోగా దరఖాస్తు చేసుకోవాలి, 14న ఇంటర్వ్యూలు భారత ప్రభుత్వ అనుసంధాన్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) నిధులు సమకూర్చే ప్రాజెక్టు కింద, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్) పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, ఫార్మాస్యూటిక్స్ విభాగానికి చెందిన డాక్టర్ భబానీ శంకర్ సతపతి నేతృత్వంలోని 'నిరోధక యోని బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా స్థానికీకరించిన లక్షిత విధానంగా క్లిండామైసిన్ నానోపార్టికల్స్ తో అనుసంధానించిన కైటోసాన్-సియాలిల్ లాక్టోస్ జెల్ స్కాఫోల్డ్: ప్రీ-క్లినికల్ సమర్థత ధ్రువీకరణ' అనే పరిశోధన ప్రాజెక్టు కింద ఈ పోస్టు అందుబాటులో ఉందని తెలియజేశారు. ఫార్మాస్యూటిక్స్ లేదా ఫార్మకాలజీలో ఎం.ఫార్మ్ డిగ్రీతో పాటు తొలి శ్రేణిలో ఉత్తీర్ణత, బలమైన అకడమిక్ రికార్డు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. పాలిమెరిక్ లేదా లిపిడ్ నానోడ్రగ్ క్యారియర్ ఫార్ము లేషన్ అభివృద్ధి, జంతువుల నిర్వహణ, యాంటీమైక్రోబయల్ పరీక్ష, విశ్లేషణాత్మక పరికర సాంకేతికతలు, ఇండెక్స్ జర్నల్స్ లో సంబంధిత ప్రచురణలలో పరిశోధన అనుభవం ఉన్న దరఖాస్తుదారులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ నియామకం తాత్కాలికమైనదని, ప్రారంభంలో ఒక ఏడాది ఉ ంటుందని పేర్కొన్నారు. సంతృప్తికరమైన పనితీరు ఆధారంగా మూడేళ్ల వరకు పొడిగించవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 42 వేల ఫెలోషిప్ తో పాటు వర్తించే ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) కూడా లభిస్తుందని తెలిపారు. దరఖాస్తు తేదీ నాటికి గరిష్ట వయో పరిమితి 28 సంవత్సరాలు ఉ ండాలని, భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోప రిమితిలో సడలింపు వర్తిస్తుందని పేర్కొన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ తాజా సీవీ, మార్కుల ధ్రువీకరణ పత్రాలు, జీపీఏటీ/ఎన్ఈటీ అర్హత ధృవీకరణ పత్రం (ఉంటేనే), స్వీయ ప్రచురిత ప్రతాలు (ఏవైనా ఉంటే).. అన్నింటినీ కలిపి ఒకే పీడీఎఫ్ ఫైలుగా bsatapat @gitam.edu కు ఈమెయిల్ చేయాలన్నారు. దాని సబ్జెక్ట్ లైన్లో »»Application for SRF Position under ANRF Projectμμ అని పేర్కొన్నాలని స్పష్టీకరించారు. దరఖాస్తులను జూలై 10వ తేదీలోగా సమర్పించాలని, జూలై 14న ఇంటర్వ్యూలు జరిగే అవకాశం ఉ ందన్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు మాత్రమే ఈమెయిల్ సమాచారం పంపుతామని తెలిపారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**శేరిలింగంపల్లి వాస్తవ తెలంగాణ** శంషిగూడ డివిజన్ పరిధిలోని ఆశ నగర్ కాలనీ హైటెన్షన్ రోడ్డులో కోటి రూపాయల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ సహకారంతో డివిజన్ లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఆశా నగర్ హైటెన్షన్ లైన్ లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గోపాల్, లింగం, నాగేష్ గౌడ్, సత్తయ్య, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్‌లో విషాదం కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి వాస్తవ తెలంగాణ** కొండాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగయ్య పెద్ద కుమారుడు క్రాంతి అకాల మరణం చెందిన విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. క్రాంతి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, తీవ్ర శోకసంద్రంలో ఉన్న నాగయ్యను ఓదార్చి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం క్రాంతి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్ "క్రాంతి మరణ వార్త మాకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం ప్రసాదించాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను" అని అన్నారు.అలాగే నందికంది గ్రామంలో ఎమ్మెల్యే గురువుగారైన రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామచంద్రయ్య పరమపదించిన నేపథ్యంలో, వారి అంత్యక్రియల్లో కూడా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ సర్పంచ్ అమరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రుక్మొద్దీన్, మండల పార్టీ అధ్యక్షుడు విట్టల్, గోవర్ధన్ రెడ్డి, పరమానందం, శ్యామ్ రావు, సర్పంచ్ సతీష్, సత్యానందం, మహేష్, సర్పంచ్ మోహన్ గౌడ్, జగదీశ్వర్, శేఖర్, ఆంజనేయులు తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# శివానగర్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి






**జిన్నారం వాస్తవ తెలంగాణ** జిన్నారం మున్సిపల్ పరిధిలోని శివనగర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యూలాండ్ పరిశ్రమ సౌజన్యంతో 60 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించిన పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి.హాజరైన జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, న్యూలాండ్ పరిశ్రమ హెచ్ఆర్ డివి రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వేణుమాధవ్ చేరికతో తెలంగాణ రక్షణ సేన మరింత బలోపేతం: కవిత



**సంగారెడ్డి వాస్తవ తెలంగాణ** సంగారెడ్డి జిల్లా ప్రజా ఉద్యమాల నాయకుడు, మాజీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెమలికొండ వేణుమాధవ్ బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన (౧=ూ) రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే నాయకుడిగా వేణుమాధవ్‌కు మంచి గుర్తింపు ఉ ందని అన్నారు. ఆయన చేరికతో సంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రక్షణ సేన మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ హక్కులు, అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పార్టీ చేపట్టే ఉద్యమాల్లో వేణుమాధవ్ కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దశబ్దాలుగా వారి కుటుంబం సామాజిక సేవలో ఉన్నదని గుర్తు చేశారు.అనంతరం వేణుమాధవ్ మాట్లాడుతూ, తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజా సమస్యల పరిష్కారం మరియు రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న కవిత నాయకత్వంపై విశ్వాసంతో తెలంగాణ రక్షణ సేనలో చేరినట్లు తెలిపారు. తెలంగాణ లో ఆంధ్ర భావజాల పార్టీలకు తావు లేదని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా ప్రజల సమస్యలను పార్టీ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు రవి చంద్ర, సయ్యద్ ఇస్మాయిల్, అర్చన సేనాపతి, జిల్లా ప్రతినిధులు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బాలయ్య, మురళి కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, శివశంకర్, బస్వరాజ్, ప్రభాకర్ రెడ్డి, బెస్త రాము, నర్సింహా, నందు, యశ్వంత్, రాము, సాయి కార్యకర్తలు మరియు వేణుమాధవ్ అనుచరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టొద్దు నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్



**నర్సాపూర్ వాస్తవ తెలంగాణ** అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు అన్న నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ హెచ్చరించారు. బుధవారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించాలని, కచ్చితంగా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని ఇంటి నిర్మాణం చేపట్టాలని ఆయన అన్నారు. నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి కొన్ని అక్రమ నిర్మాణాల పనుల గురించి సమాచారం రాగా వాటికి నోటీసులు ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు.నర్సాపూర్ మున్సిపల్ నగర అభివృద్ధికి 15 కోట్లు మంజూరు కావడం జరిగిందని, దీంతో ప్రతి వార్డుకు 30 లక్షలతో డ్రైనేజీ సిసి రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.



- రేపు తుంగభద్ర ప్రాజెక్ట్ కొత్త స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవం
- హాజరుకానున్న చంద్రబాబు,రేవంత్, డీకే శివకుమార్
- ₹51 కోట్ల వ్యయంతో ఆరు నెలల్లో గేట్ల నిర్మాణం పూర్తి
- 2024 వరదల్లో గేటు కొట్టుకుపోవడంతో పటిష్ట చర్యలు

# త్రిమూర్తుల.. తుంగభద్రం!

## ముగ్గురు సీఎంల భేటీకి రెడీ

**వాస్తవ తెలంగాణ** తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకకు అత్యంత కీలకమైన జలవనరుగా ఉన్న తుంగభద్ర డ్యామ్ పునర్నిర్మాణ పనుల్లో ఒక కీలక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. ప్రాజెక్టుకు కొత్తగా అమర్చిన క్రస్ట్ గేట్లను గురువారం అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ముగ్గురు కీలక ముఖ్యమంత్రులు ఏకకాలంలో హాజరుకావడం విశేషం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, అలాగే కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఒకే వేదికపైకి రానున్నారు. అంతర్రాష్ట్ర జల వివాదాలు పక్కన పెట్టి, మూడు రాష్ట్రాల ప్రయోజనాలకు ముడిపడి ఉన్న ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో ముగ్గురు ముఖ్యమంత్రులు పాల్గొనడం రాజకీయంగా, వ్యూహాత్మకంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

### రూ. 51 కోట్లతో ఆధునికీకరణ..

గత 2024 ఆగస్టు నెలలో వచ్చిన భారీ వరద ప్రవాహానికి తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ప్రాజెక్టు భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవడంతో, రంగంలోకి దిగిన నిపుణుల కమిటీ అత్యవసరంగా డ్యామ్ భద్రతను సమీక్షించింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ప్రాజెక్టులోని అన్ని గేట్లను పూర్తిగా మార్చాలని కమిటీ సిఫార్సు చేసింది. ఈ మేరకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టిన యంత్రాంగం, సుమారు ₹51 కోట్ల వ్యయంతో మొత్తం 33 క్రస్ట్ గేట్లను అత్యాధునిక సాంకేతికతతో కొత్తగా డిజైన్ చేసి అమర్చింది. ఈ కొత్త గేట్ల ఏర్పాటుతో తుంగభద్ర ప్రాజెక్టుకు పూర్వ వైభవం రావడమే కాకుండా, రాయలసీమ, తెలంగాణలోని మహబూబ్ నగర్, కర్ణాటకలోని బళ్లారి తదితర ప్రాంతాల రైతులకు సాగునీటి భద్రత లభించనుంది.

# ముురుగులో ముక్దుం నగర్.. నిద్రలో అధికారులు!

డ్రైనేజీలో కలుస్తున్న తాగునీటి లీకేజీ
చౌరస్తా నుంచి గల్లీల వరకు మురుగు ప్రవాహం
జారిపడుతున్న పాదచారులు.. ప్రమాదాల్లో వాహనదారులు
ఫిర్యాదులకూ స్పందన కరువు
దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న స్థానికులు
వ్యాధుల భయంతో బిక్కుబిక్కుమంటున్న ప్రజలు



**జగద్గిరిగుట్ట, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** జగద్గిరిగుట్ట సర్కిల్ పరిధిలోని ముక్దుం నగర్, పోలాల బస్తీ చౌరస్తా ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ, తాగునీటి లీకేజీ సమస్య స్థానిక ప్రజలకు శాపంగా మారింది. నెలల తరబడి కొనసాగుతున్న ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానం స్థలంలోని యోగ పాఠశాల కాంపౌండ్ వాల్ సమీపంలో తాగునీటి పైపులైన్ లీకేజీ ఏర్పడి, ఆ నీరు డ్రైనేజీలో కలిసి వృథాగా పారిపోతోంది. ఈ లీకేజీ నీరు శ్రీ శివ సీతారామాంజనేయ స్వామి దేవాలయం ముందు నుంచి ముక్దుం నగర్ చౌరస్తా వరకు నిరంతరంగా ప్రవహిస్తూ మురుగు కాలువను తలపిస్తోంది. ఇదే సమయంలో ప్రధాన రహదారి నుంచి అంతర్గత గల్లీల వరకు డ్రైనేజీలు పొంగిపొర్లుతూ రోడ్లపైకి చేరుతున్నాయి. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ద్విచక్ర వాహనదారులు తరచూ జారిపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వర్షం లేకపోయినా రోడ్లపై నిలిచిపోయిన మురుగు నీటితో ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. మురుగు నీటి దుర్వాసనతో పరిసర ప్రాంత ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



లీకేజీని అరికట్టడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు, వ్యాధులు సంభవించేలోపే అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోవడంతో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన ఈ సమస్యను సంబంధిత వాటర్‌వర్క్స్, శానిటేషన్ అధికారులు అత్యవసరంగా పరిగణించి తక్షణమే తాగునీటి

# బిఇందిరా మహిళా శక్తి పథకం మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక. బొంతు శ్రీదేవి యాదవ్





**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/**మేడ్చల్ జిల్లా కాప్ర మండలం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఇందిరా మహాశక్తి చీరల పంపిణీ " కార్యక్రమంలో భాగంగా కుషాయిగూడ డివిజన్ పరిధిలో నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులు, స్వయం సహాయక బృందాల (ఎస్ హెచ్ జి) సభ్యులకు బొంతు శ్రీదేవి చేతుల మీదుగా ఇందిరా మహిళ శక్తి పథకం చీరలను పంపిణీ చేశారు. బొంతు శ్రీదేవి యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్వావలంబన, ఆత్మగౌరవమే ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వం పని చేస్తోందని కొనియాడారు. ఇందిరా మహాశక్తి పథకం మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉద్దేశించినదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ యాదవ్,సాకేత్ గౌడ్,మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నల్ల పోచమ్మ భూ లక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్టోత్సవాలు

## హాజరైన ట్రేడ్ మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి



**చౌటకూర్//వాస్తవ తెలంగాణ న్యూస్ కృష్ణ కాంత్ ప్రతినిధి జూన్ 24** సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని తాడు దాన్ పల్లి లో నల్ల పోచమ్మ భూదేవి విగ్రహ ప్రతిష్టోత్సవాలు బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు మహోత్సవాలలో భాగంగా బుధవారం నల్ల పోచమ్మ భూ లక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్ట ను వేద బ్రాహ్మణ పండితుల మంత్రో చరణాల మధ్య ప్రతిష్టించారు ఉత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం అమ్మవారికి ఇంటింటి నుంచి బోనాలు పోతురాజుల విన్యాసాలు ఊరేగింపులు నిర్వహించారు అనంతరం నల్ల పోచమ్మ భూదేవి మాతకు బోనాలు



సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమానికి గ్రామ ఆడపడుచులు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు

# బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాద పూర్వకంగా కలిసిన అయోధ్య నగర్ కాలనీ నూతన అధ్యక్షులు జోయెల్...



**వాస్తవ తెలంగాణ న్యూస్** మంగళవారం 132 - అయోధ్య నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికల్లో గెలిచిన జోయెల్ (బాబీ) కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కాలనీ అభివృద్ధిలో యువతరం ముందున్నప్పుడే కాలనీ అభివృద్ధి సాధ్యమని అన్నారు. నిరుపేదలు అధికంగా జీవించే అయోధ్య నగర్ కాలనీలో కాలనీ అభివృద్ధిలో నూతన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అయోధ్య నగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



